క్లుప్తంగా

నేడు రాయచోటిలో 'వైఎస్సార్ ఆసరా'

రాయచోటి అర్బన్ : నేడు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వైఎస్సార్ ఆసరాపై సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఎంపీడీఓ మల్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి మున్సిపాలిటీతోపాటు రూరల్ మండలాల డ్వాక్రా సంఘాల రుణమాఫీ నాల్గో విడవ నిధుల పంపిణీలో భాగంగా సమావేశం జరుగుతోందన్నారు. సమావేశంలో డ్వాక్రా మహిళ సంఘాల స్టాల్‌ల ఏర్పాటుతోపాటు వైఎస్‌ఆర్ ఆసరా మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం, మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ పల్లవు రాజమ్మతోపాటు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు హాజరవుతారన్నారు.

నేడు మండల సమావేశం

చిన్నమండెం : నేడు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుధామాధురి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దివ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సభా భవనంలో మంగళవారం జరిగే ఈ సమావేశానికి మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలన్నారు. అలాగే మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రైతుకుంటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

సంబేపల్లె : మండల వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎస్ఐ రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశానుసారం మండలంలోని వివిధ గ్రామాలలో సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు.

బాధ్యతల స్వీకరణ


భక్తవత్సలం, రాయచోటి ఎస్ఐ

రాయచోటి టౌన్ : రాయచోటి అర్బన్ ఎస్ఐగా భక్తవత్సలం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన సుండుపల్లె, వీరబల్లె, రాజంపేట మన్నూరు స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. అక్కడ నుంచి రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న నరసింహారెడ్డి డీపీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

ఓబులవారిపల్లె ఎస్ఐగా చిన్నపెద్దయ్య



ఓబులవారిపల్లె : మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా చిన్నపెద్దయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు పరిరక్షించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన శ్రీకాంత్ రెడ్డి సీఐగా పదోన్నతి పొంది తిరుపతి బాలాజీ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న డీఈఓ శ్రీరాం పురుషోత్తం

రాయచోటి టౌన్ : ఆర్‌జేయూపీ(రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్) క్యాలెండర్, డైరీలను అన్నమయ్య జిల్లా విద్యాధికారి శ్రీ పురుషోత్తం ఆవిష్కరించారు. సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ వాటిని విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌జేయూపీ అధ్యక్షులు సిద్దయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎల్.రవీంద్రనాథ్ బాబు, జిల్లా గౌరవాధ్యక్షులు గుదిబండ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చంద్రశేఖర్ రెడ్డి, సభ్యులు రెడ్డెన్న, మస్తాన్, వెంకటసుబ్బయ్య, బాషా, కలీం, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : ముక్కవారిపల్లెలో అకస్మాత్తుగా మృతి చెందిన ఎస్.లింగారెడ్డి మృతదేహాన్ని సోమవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సందర్శించి నివాళులర్పించారు. లింగారెడ్డి మృతికి కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని సంతాపాన్ని వ్యక్తం చేశారు. అలాగే అదే గ్రామంలోని దళిత వాడలో బి.నాగేంద్ర మృతదేహానికి ప్రభుత్వ విప్ కొరముట్ల సందర్శించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, సర్పంచ్‌లు జరుగు నారాయణ రెడ్డి, పోలి పాపిరెడ్డి, చెంగల్ రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం

మండల సర్వసభ్య సమావేశంలో
వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలో ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి అన్నారు. సోమవారం మండల అధ్యక్షులు సౌందర్య అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొండూరు విజయ్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో ఎక్కడా నీటి సమస్య లేకుండా చేశామన్నారు. ఒకవేళ నీటి సమస్య వస్తే యుద్ధప్రాతిపదికన సమస్యను పరిష్కరిస్తామని ఆయన అన్నారు. ఆరోగ్య శ్రీ పరిధి పెంపు, నాడు – నేడుతో బడుల రూపురేఖల మార్పు, విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందించిన పార్టీ ఒక్క వైఎస్సార్‌సీపీనే అని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ దృష్టికి తీసుకువస్తే వాటిని సత్వరం పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. అంగన్‌వాడీ సెంటర్లపై ఫిర్యాదులు అందుతున్నాయని, సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ సీడీపీఓ రాజేశ్వరీ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎక్కడా ఎలాంటి సమస్య లేకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపడతామన్నారు. విద్యుత్ ఏఈ షఫీ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా విద్యుత్ సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే మరమ్మతులు చేస్తామన్నారు. అధికారులు వారివారి శాఖల నివేదికలను వివరించారు. అంతకుముందు తహసీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ వరప్రసాద్ ఆయా శాఖలలో జరుగుతున్న అభివృద్ధి సభ ముందు ప్రస్తావించారు. కార్యక్రమంలో ఏఓ పద్మభూషన్ రెడ్డి, గుడ్ల వీరనారాయణ రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ వరప్రసాద్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా వైఎస్ జగన్‌ను తిరిగి ఎన్నుకుందాం


ఆకేపాటితో భేటీ అయిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప మేయర్ సురేష్‌బాబు

రాజంపేట రూరల్ : రాష్ట్రంలో జనరంజక పాలన అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా కొనియాడారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లోని జెడ్పీ చైర్మన్ నివాసంలో ఆకేపాటి ఇచ్చిన తేనెటి విందులో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప మేయర్ కె.సురేష్‌బాబు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా జననేత సాగిస్తున్న పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. ప్రతి అర్హుడికి పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని తెలియజేశారు. రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహనెడ్డిని తిరిగి ఎన్నుకుందామని పిలుపునిచ్చారు.

ఎంపీడీఓకు సన్మానం


ఎంపీడీఓ వరప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండల ఎంపీడీఓ వరప్రసాద్ బదిలీపై వెళ్తుండటంతో సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీడీఓగా నాలుగు సంవత్సరాలపాటు వరప్రసాద్ పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నారన్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ పెనగలూరు మండల ప్రజల ఆప్యాయత మరువలేనన్నారు. అనంతరం వైస్ ఎంపీపీ తదితరులు ఎంపీడీఓను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, మండల అధ్యక్షురాలు సౌందర్య, తహసీల్దార్ శ్రీధర్ రావు, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, ఏఓ పద్మభూషన్ రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై డీఆర్‌ఓకు ఫిర్యాదు


డీఆర్‌ఓకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

రాయచోటి అర్బన్ : తనపై బెదిరింపులకు పాల్పడుతూ తన భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ పెద్దమండెం మండలం దిగువపల్లెకు చెందిన కాల్వపల్లె చిన్నప్ప కుటుంబీకులు డీఆర్‌ఓ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ అన్నమయ్య జిల్లా నేత ఎం.విశ్వనాథ్‌తో కలసి డీఆర్‌ఓను స్పందన కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ విలేకరులతో మాట్లాడుతూ పెద్దమండెం మండలం దిగువపల్లెకు చెందిన సర్వే నంబరు288/2లో కాల్వపల్లె చిన్నప్పకు 5.21 ఎకరాల భూమి ఉందన్నారు. సదరు భూమిని గాలివీడు మండలం దానంరెడ్డిగారిపల్లెకు చెందిన జయరామి రెడ్డి సోదరులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. భూమిని వదలి వెళ్లాలని లేనిపక్షంలో చంపేస్తామంటూ భయభ్రాంతులు గురిచేస్తున్నారంటూ ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చిన్నప్పకు న్యాయం చేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లిబరేషన్ నాయకులు రమణ, దళిత, బహుజన ప్రజాగళం నేత నాగేశ్వరరావు, తుర్లు నాని, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


వ్యాధులు గురించి వివరిస్తున్న డాక్టర్ కార్తిక్

నందలూరు(రాజంపేట) : విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి పౌష్టికాహారం ఆవశ్యకత గురించి తెలుసుకోవాలని ప్రభుత్వ వైద్యులు కార్తిక్ విశ్వనాథ్ పేర్కొన్నారు. ఐదవరోజు ప్రత్యేక శిబిరంలో భాగంగా జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యకర్తలకు కాలానుగుణంగా వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు గురించి అవగాహన సదస్సు ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తిక్ మాట్లాడుతూ టైఫాయిడ్, జలుబు, జ్వరం, కామెర్లు మొదలగు వ్యాధులు నివారణ చర్యలు గురించి విద్యార్థులకు వివరించారు.

కొత్త ఓటర్లకు ఈవీఎంపై అవగాహన


సిరివరంలో ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలో కొత్తగా నమోదైన ఓటర్లకు ఈవీఎం ద్వారా సోమవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వ్యవసాయ అధికారి పవన్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామిల ఆధ్వర్యంలో సిరివరం, తిరుణంపల్లి, ఎస్ఆర్ పురం, పెనగలూరు, ఇండ్లూరు బూత్‌లలో కొత్త ఓటర్లకు ఈవీఎంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓటు ఎలా వేయాలన్న విషయాన్ని తెలియజేశారు.

ఇంటి నిర్మాణానికి ఎంపీ ఆర్థిక సహాయం


నగదు అందిస్తున్న ముద్దా రామసుబ్బారెడ్డి

పుల్లంపేట : మండలంలోని తిప్పాయిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన సిద్దయ్య కుటుంబానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రూ. లక్ష నగదు అందించారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో సిద్దయ్య తమకు పక్కా గృహం లేనందున ఆర్థిక సహాయం చేయాలని కోరగా వెంటనే స్పందించిన ఎంపీ సోమవారం పుల్లంపేట వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు ముద్దా రామసుబ్బారెడ్డికి నగదు అందజేశారు. దీంతో రామసుబ్బారెడ్డి సోమవారం తిప్పాయిపల్లెకు సిద్దయ్య కుటుంబ సభ్యులకు నగదు అందించారు. జెడ్పీటీసీ దార్ల గీతాదేవి, రామనాథం, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

శాక్స్ ప్రధాన కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య

రాజంపేట రూరల్ : ఏపీ శాక్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పల్లవు వెంకటసుబ్బయ్య సోమవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఐసీటీసీ కౌన్సిలర్‌గా దాదాపు 20 సంవత్సరాల నుంచి సేవలందిస్తున్నట్లు తెలియజేశారు. తిరుపతిలోని రాస్ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శి వేణు ఆధ్యక్షతన నూతన కమిటీని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నట్లు తెలయజేశారు. తనపై నమ్మకం ఉంచి తనను ఎన్నుకున్నందుకు కమిటీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. యూనియన్ కోసం తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు.

సంక్షేమ పథకాలు కార్మికులకు చేరువయ్యాయి

రాజంపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.పద్మావతి కోరారు. స్థానిక న్యూ ఆంధ్ర ఫంక్షన్ హాల్‌లో అన్నమయ్య ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషన్ డే వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ పద్మావతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేటి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ఎన్నో సంక్షేమ పథకాలు కార్మికులకు ఎంతో చేరువయ్యాయని కొనియాడారు. వేడుకలలో రాష్ట్ర గౌరవ సలహదారు కొరముట్ల నరసింహులు, జిల్లా అధ్యక్షులు షఫక్ అస్లాం, రాయచోటి, సుండుపల్లి యూనియన్ అధ్యక్షులు ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

నియామకం

లక్కిరెడ్డిపల్లె : వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా మద్దిరేవుల రామాంజులు నియమితులయ్యారు. ఈనెల 26న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఎస్సీ కమిటీని ఎంపిక చేశారు. ఇందులో మండల కేంద్రానికి చెందిన రామాంజులును కార్యదర్శిగా నియమించారు. తమ నియామకానికి సహకరించిన వారికి రామాంజులు కృతజ్ఞతలు తెలిపారు.

విఘ్నేశుడికి సంకటహర పూజలు


ప్రత్యేక పూజలందుకున్న వినాయకుడు

రాయచోటి టౌన్ : పట్టణంలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో దాతలకు ప్రతి రోజు మూడు పూటలా ఉచితంగా అన్నప్రసాదాన్ని ఆలయ కమిటీ, అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు సోమవారం ఉదయం ఆలయానికి భక్తులు అధికంగా వచ్చారు. ఆలయ అధికారులు అందుకు తగినట్లుగానే ఏర్పాట్లు చేశారు. అంతకుముందు ఆలయంలో కొలువైన శ్రీ వరసిద్ధి వినాయకుడికి సంకటహర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి చందనం, పసుపు, పాలు, పెరుగు, తేనె, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారికి ఇష్టమైన గరిక, పూలతో అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు.

ఒంటిమిట్టలో చేతబడి కలకలం


రామలక్షుమ్మ ఇంటి ముంగిట చేతబడి చేసిన ఆనవాళ్లు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొత్త మాధవరం గ్రామంలో సోమవారం చేతబడి చేసిన ఆనవాళ్లు కనిపించడంతో మండలంలో కలకలం రేగింది. వివరాల్లోకి వెళ్తే ఆదివారం అర్ధరాత్రి మూడు గంటల సమయంలో కొత్తమాధవరంలోని మామిళ్ల రామలక్షమ్మ ఇంటి ముంగిట నక్షత్రం ముగ్గు వేసి ఆ ముగ్గులో ఒక పిండి బొమ్మను ఏర్పాటు చేసి ఆ బొమ్మకు ముళ్లులు గుచ్చినటువంటి ఆనవాళ్లు కనిపించడంతో ఆ చుట్టుపక్కల వారిలో కలకలం జరిగింది. అది ఎవరు చేసి ఉంటారు అని తెలుసుకోవడం కోసం ఆ పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా ఆదివారం అర్ధరాత్రి మూడు గంటల సమయంలో ఈ చేతబడి కార్యక్రమం చేసినట్లు పలువురు తెలుపుతున్నారు.

అర్జీదారులకు ఉచిత భోజనం


అర్జీదారులకు భోజనం వడ్డిస్తున్న దాతలు

రాయచోటి టౌన్ : జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు ఉచితంగా భోజనం అందజేశారు. ప్రతి సోమవారం జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి తమ సమస్యలను కలెక్టర్‌కు తెలియజేసేందుకు కలెక్టర్ కార్యాలయానికి వస్తుంటారు. వారి ఆకలి తీర్చేందుకు అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దాతల సహకారంతో ఉచితంగా భోజనం అందిస్తున్నారు. ఈ కార్యక్రమం 46 వారాల నుంచి కొనసాగిస్తున్నారు.

మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి


యూనిట్‌ను ప్రారంభిస్తున్న పోలా రమణారెడ్డి

రాజంపేట : రాజంపేట మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రగతి యూనిట్‌ను మున్సిపల్ కౌన్సిలర్, కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా రమణారెడ్డి ప్రారంభించారు. సోమవారం నలంద జూనియర్ కళాశాలలో రూ. 2లక్షల విలువ చేసే పట్టణ ప్రగతి యూనిట్‌ను లబ్ధిదారు కరీమున్నీసాకు అందచేశారు. ఈ సందర్భంగా పోలా మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను తీసుకొచ్చారన్నారు. యూనిట్ మంజూరునకు సహకరించిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసుల రెడ్డి, మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మికి మెప్మా సిటీ మేనేజరు గోపినాథ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సుమియా షేక్ మునాఫ్ కమ్యూనిటీ ఆర్గనైజర్ భాస్కర్, పద్మావతి, ఆర్పీలు పాల్గొన్నారు.

అన్నదాన వితరణతో ఆత్మ సంతృప్తి


పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : అన్నదానం చేయడం ద్వారా పేదల ఆకలి తీర్చామన్న ఆత్మ సంతృప్తి కలుగుతుందని భారతీయ జనతాపార్టీ రాజంపేట అసెంబ్లీ కో–కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు నిరంతర అన్నదాన వితరణ కార్యక్రమం సోమవారం స్థానిక బస్టాండ్ సమీపంలోని శ్రీరామ్ ప్రజా వైద్యశాల ఎదురుగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ రాజంపేట అసెంబ్లీ పరిధిలో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాన్ని ఇటీవల రమేష్ నాయుడు తన మిత్రబృందంతో ప్రారంభించడం శుభపరిణామమన్నారు. అసెంబ్లీ పరిధిలోని మండలాలలో ఒక్కో రోజు ఒక్కో మండలంలో జరిపేలా నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మేడా వెంకట కుమార్, బీజేపీ నాయకులు మండెం నాగేంద్ర, లోకేష్ రాజు, బజ్జీల అంకయ్య, ఫ్రూట్స్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులనే తీసుకోవాలి


ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దేవనాథరెడ్డి

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఉర్దూ స్కూల్ పక్కన ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించినటువంటి కూరగాయల విక్రయ కేంద్రాన్ని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనం తీసుకునే ఆహార పదార్థాలు చాలా వరకు విషపూరితంగా మారాయన్నారు. దానివల్ల మానవాళి అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. కుటుంబంలోని సభ్యులందరూ ఏదో రకమైనటువంటి జబ్బులతో ఇబ్బంది పడుతూ ఆసుపత్రికి వెళ్లి వారు సంపాదించిన డబ్బులను ఖర్చు పెడుతున్నారని తెలియజేశారు. రసాయనాలతో కూడిన కూరగాయలు తినడం వల్ల అనేకమైన దుష్పరిణామాలు ఉన్నందున వీటన్నింటికీ స్వస్తి పలుకుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులని ప్రజలు ఆహారంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ అన్నమయ్య జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణం రాజు, ఎంపీటీసీ ఏజాజ్ అలీఖాన్, సర్పంచ్ నజీర్ అహ్మద్, మండల జేసీఎస్ కన్వీనర్ చుక్కా అంజనప్ప, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ ఏర్పాటు ఉద్యమానికి సిద్ధంకండి


మాట్లాడుతున్న పీఎల్ నరసింహులు

రాయచోటి అర్బన్ : కడప – రాయచోటి – బెంగళూరు రైల్వేలైన్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలన్న డిమాండ్‌తో ఉద్యమాన్ని చేపట్టేందుకు అన్నివర్గాల ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు అన్నారు. సోమవారం స్థానికంగా రాయచోటి నియోజకవర్గ స్థాయి సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ఆర్ హయాంలో మంజూరైన కడప – బెంగళూరు రైల్వేలైన్ నిర్మాణాన్ని పాత అలైన్‌మెంట్ ప్రకారం నిర్మిస్తే రాయచోటి నియోజకవర్గ ప్రజలకు, రైతాంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందితేనే ఈ ప్రాంత యువతకు ఉపాధి దొరకుతుందన్నారు. పరిశ్రమలు లేకపోవడంతో ఇక్కడివారు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలసపోతున్నారన్నారు. రాయచోటి ప్రాంతంలో టమాటా జ్యూస్, మామిడి పండ్ల ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి దక్కుతుందన్నారు. రాయచోటి అభివృద్ధి జరగాలంటే వెంటనే పరిశ్రమలను ఏర్పాటు చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాయచోటి కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు, నేతలు పుల్లయ్య, బి.వెంకటరమణ, రమణ, అనిల్, సురేంద్ర, మహిళా నాయకురాళ్లు అరుణ, ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థుల బృందం

రాజంపేట రూరల్ : శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు యూనిట్–1లో భాగంగా మండల పరిధిలోని కొండ్లోపల్లెలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో సోమవారం మొక్కలు నాటారు. ఎంపీపీ పాఠశాల ఆవరణతో పాటు రహదారి ఇరు వైపులా శుభ్రపరిచి మొక్కలు నాటే కార్యక్రమం చేశారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్, ప్రొఫెసర్ ఎస్.వెంకటరామిరెడ్డి, వైవీయూ జువాలజీ ప్రొఫెసర్ ఎం.రాజగోపాలెడ్డిలు కార్యక్రమాన్ని పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి శ్రీనివాసరెడ్డి

చిన్నమండెం : హర్ ఘర్ జల్ పథకం ద్వారా మండల పరిధిలోని ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి అందించే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎంపీడీఓ దివ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో హర్ ఘర్ జల్ పథకంపై అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ హరినాథరెడ్డి, ఏపీఎం రెడ్డప్ప, ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్, సీసీలు, పంచాయతీ సెక్రటరీలు, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వదంతులు నమ్మారు.. బారులు తీరారు

- ఈ – కేవైసీ చివరి రోజంటూ పుకార్లు
- గ్యాస్ ఏజెన్సీ ముందు క్యూలైన్‌లో వందల సంఖ్యలో వేచివున్న మహిళలు


ఈ – కేవైసీ కోసం భారీగా వచ్చిన మహిళలు

సిద్దవటం : మాధవరం – 1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో ఉన్న ఇండేన్ గ్యాస్ వినియోగదారుల కేంద్రం వద్ద సోమవారం వినియోగదారులు ఈ–కేవైసీ కోసం భారీగా తరలి వచ్చారు. వదంతులను నమ్మి ఒక్కసారిగా మహిళలు అందరూ రావడంతో ఆ ప్రాంతం జనంతో కిక్కిరిసింది. గ్రామీణ ప్రాంతాల మహిళలు ఉదయం 7 గంటల నుంచే ఉన్నామని, ఇంత వరకు మాకు సబ్సిడీ కోసం ఈ – కేవైసీ చేయలేదని ఈరోజు ఒక్కటే చివరి రోజు అని తెలియడంతో ఇక్కడకు వచ్చినట్టు పలువురు మహిళలు చెప్పారు. ఈ విషయమై ఇండేన్ గ్యాస్ సిద్దవటం మండల ఏజెన్సీ హరిక్రిష్ణను వివరణ కోరగా మా వినియోగదారులు (మహిళలు) ఎవరో చెప్పిన వదంతులను నమ్మి గ్రామీణ ప్రాంతాల వారందరూ ఒక్కసారిగా వచ్చారని తెలియజేశారు. వదంతులు నమ్మవద్దని సూచించారు. ఇంకా నాలుగు మాసాలు గడువుందని, ప్రతి ఒక్కరూ క్యూలైన్‌లో ఉండి ఈకేవైసీ చేయించుకోవాలని వినియోగదారులకు తెలియజేశామని ఆయన చెప్పారు.